సాక్షి
వికారాబాద్
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. 8లో▸



ఉద్దేశపూర్వకంగానే..

హైడ్రా పరిధిలో లేకున్నా కొందరు రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా తమ ఇళ్లు కూల్చివేసి, రోడ్డుపాలు చేశారు. 8లో▸



నిఘా నేత్రం.. నామమాత్రం

పుర పరిధిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నేరాలు జరిగినా నిందితుల గుర్తింపులో జాప్యం జరుగుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

ఫార్మా కంపెనీకి 20 ఎకరాల భూమి

లిఖితపూర్వకంగా రాసిచ్చిన రైతులు

దుద్యాల్: ఫార్మా కంపెనీ ఏర్పాటును కొందరు వ్యతిరేకిస్తుండగా.. మరి కొందరు మద్దతు తెలుపుతూ ఏకంగా 20 ఎకరాల భూమిని రాసి ఇచ్చారు. మండల పరిధి హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లతండాలను కలుపుకొంటూ సుమారు 1300 ఎకరాల్లో ఫార్మ కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిని చాలా కాలంగా పరిసర ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. కానీ.. పోలేపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు, సర్వే నంబర్ 67లోని 20 ఎకరాల 20 గుంటల భూమిని సంస్థ ఏర్పాటుకు రాసి ఇచ్చినట్లు భూసేకరణ అధికారి శ్రీనివాస్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆదివారం నగరంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ నిర్వహించిన తహసీల్దార్ల ముఖాముఖిలో వారు వెల్లడించారు. వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు అందజేశారు.

కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య




పోసానికుంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: చెరువు శిఖం భూములను కబ్జా చేసి, లేఅవుట్లుగా విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధి రూప్‌ఖాన్‌పేటలోని పోసానికుంట, పట్టణ కేంద్రంలోని కొత్తచెరువు, శ్రీనివాస్‌నగర్‌లోని శిఖం భూములను సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రూప్‌ఖాన్‌పేట్, పట్టణంలోని కుంటలను కొందరు కబ్జా చేసి ఇళ్లు నిర్మించారని ఆరోపించారు. సందరు వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తచెరువు సర్వే నంబర్ 253, 254, 256,257లలో 45 ఎకరాలకు పైగా భూమి కబ్జాకు గురైందన్నారు. రూప్‌ఖాన్‌పేటలోని సర్వే నంబర్ 243లో 23.34 ఎకరాలను ఆక్రమించి, లేఅవుట్‌గా మార్చారని తెలిపారు. చెరువుల శిఖంలంలో వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. హైడ్రా తరహా జిల్లాలోనూ కమిటీ ఏర్పాటు చేసి, భూములు ఆక్రమించి, చేపట్టిన కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, లాలయ్య, శేఖర్, ప్రశాంత్, అనిల్ ఉన్నారు.

పేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

కాచిగూడ: మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు అన్యాయంగా కూల్చేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. హైడ్రా దాడులపై ప్రభుత్వం పునః సమీక్షించుకోకుంటే బీజేపీ పోరాడేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ప్రధాని మోదీ 74వ జన్మదినం సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో సేవా మహాయజ్ఞం పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుండాలే.. పేదల ఇళ్లు కూల్చి, వారి ఉసురు తీసుకోవడమే ఇందిరమ్మ రాజ్యమా' అని ప్రశ్నించారు. పేదలు కన్నీళ్లు పెడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కన్పించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



సంతాప సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మాడ్గుల: రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే మిన్నగా బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. వామపక్ష ఉద్యమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. మెరుగైన, సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన అని అన్నారు. ఆయన ఆలోచనలు నెరవేర్చే దిశగా అందరం కలిసి పని చేయాలని, అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



మొక్కజొన్న నూర్పిడి చేస్తున్న మహిళా రైతు

ఆందోళనలో మక్క రైతు

మొదలైన మొక్కజొన్న నూర్పిళ్లు

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి
- జిల్లాలో 51వేల ఎకరాల్లో సాగు
- లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

వికారాబాద్: సీజన్ ప్రారంభమైనా.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వటం లేదు. ఏటా సీజన్ ప్రారంభం నాటికి కేంద్రాలు ప్రారంభం అయ్యేవి. కానీ.. ఈ సంవత్సరం ఇప్పటి వరకు సెంటర్లను ఏర్పాటు చేయకపోవటంతో.. అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అసలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందా? లేదా అని ప్రశ్నిస్తున్నారు.

51వేల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది రైతులు వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో జిల్లాలో 51 వేల ఎకరాలకు పైగా మక్కలు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో మక్క రైతుల్లో ఆందోళన మొదలు కాగా.. దిగుబడి సేకరణకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని మార్క్ ఫెడ్ అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడం గుదిబండగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

ధరల పతనం..

జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్, దారూరు, మర్పల్లి తదితర మార్కెట్లకు ప్రతి వారం 5 వేల నుంచి 8 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. పక్షం రోజుల క్రితం క్వింటా మక్క ధర రూ.2200 నుంచి 2400లు ఉండగా.. ప్రస్తుతం రూ.1700 నుంచి 2100కి వరకు పడిపోయింది. ప్రభుత్వ మద్దతు ధర గత సీజన్‌లో రూ.2024 ఉండగా, ఈ ఏడాది రూ.2090లుగా కేంద్రం నిర్ణయించింది. మద్దతు ధర కొంచెం అటు ఇటుఉన్నప్పటికీ.. తూకంలో మోసం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. మద్దతు ధర కంటే.. ఓపెన్ మార్కెట్లో ధరలు పతనమవుతుండటంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 51వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన లక్ష మెట్రిక్ టన్నుల దిగబడి రానుంది. ఇంత పెద్ద మొత్తంలో సాగైన మక్కను ప్రైవేటు వ్యక్తులే కొనుగోలు చేయాల్సి వస్తే మాత్రం.. బహిరంగ మార్కెట్లో ధరలు మరింత దిగజారే అవకాశం ఉంది.

దళారి దందా.. రైతన్న దగా

సీజన్ మొదలై.. నూర్పిడులు ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా రైతు ఉత్పత్తులు మార్కెట్‌కు చేరుతున్నాయి. మార్కెట్లలో వారం వారం ధరల తగ్గదల, తూకంలో మోసం జరుగుతుండటంతో.. రైతులకు ఏమి పాలుపోవడం లేదు. దీంతో మక్కలు ఎక్కడ విక్రయించుకోవాలో తెలియక దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు చెప్పిందే ధర.. ఇచ్చిందే మద్దతు అన్న తరహాలో.. దళారీ పనితనాన్ని రైతుల నెత్తిన రుద్దుతున్నారు. దీంతో చేసేది లేక రైతులు వారికే దిగుబడిని విక్రయిస్తున్నారు.

కర్షకులకు తీవ్ర నష్టం

ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటం వలన మార్కెట్లో ధరల ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం రూ.2090 మద్దతు ధర నిర్ణయించగా, ప్రస్తుతం జిల్లాకు చెందిన వ్యవ సాయ మార్కెట్లలో తేమ తదితర కారణాలు చూపి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ.. తూకంలో మోసం చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

ప్రయోజనం ఉండదు

సీజన్ అయిపోయాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదని రైతులు స్పష్టంచేస్తున్నారు. తమ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేయలేదని, మరోమార్గం లేక పంటను దళారులకు విక్రయించక తప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దళారులు పొలాల వద్దకు వచ్చి, తమను మభ్యపెట్టి దిగుబడి తక్కువ ధరలకు కొనుగోలు చేయడంతో పాటు.. తూకంలో మోసం చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

- పక్కదోవ పట్టించేందుకే హైడ్రా డ్రామా
- కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: రుణమాఫీ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా డ్రామాను తెరపైకి తీసుకొచ్చారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ ఆరోపించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తుక్కుగూడ బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి.. పది నెలలు గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో 62 లక్షల మంది అర్హులు ఉండగా కేవలం 18 లక్షల మందికే మాఫీ జరిగిందన్నారు. కుటుంబ నిర్ధారణ, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఉద్యోగులంటూ కుంటిసాకులు చెబుతూ వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పడం ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు పరిచిన దాఖలాలు లేవన్నారు. రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేసే వరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో భాగంగా నగరంలోని ఇందిరా పార్కు వద్ద సోమవారం ఉదయం 11 నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు రైతు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. 24 గంటల దీక్షకు పెద్ద సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ.. నిర్వాసితులు, పేదలకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి తుమ్మేటి వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దొండ రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ టేకుల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామగుండంలో రాడార్ కేంద్రం వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న నర్సింహులు తదితరులు

కేబీఆర్ పార్క్ ఎదుట నిరసన

దోమ: 'దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయవద్దు. కాదని ఏర్పాటు చేస్తే మరో తెలంగాణ ఉద్యమం తెరపైకి వస్తుంది' అని ఉద్యమకారుడు నర్సింహులు హెచ్చరించారు. రాడార్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. మండల పరిధి మల్లేపల్లికి చెందిన ఉద్యమకారుడు నర్సింహులు ఆధ్వర్యంలో.. హైదరాబాద్‌కు చెందిన పలువురు నగరంలోని కేబీఆర్ పార్క్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ.. పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతం 2900 ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేవీ రాడార్ ఏర్పాటుకు చేస్తున్న సన్నాహాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టేషన్ ఏర్పాటుతో లక్షలాది వృక్ష సంపద, వన్యప్రాణుల ఉనికి ప్రశ్నార్థకమవుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు, 22 గ్రామాల ప్రజల జీవనోపాధి విధ్వంసానికి గురవుతుందని వాపోయారు. జీవరాశిపై రేడియేషన్ ప్రభావం పడుతుందన్నారు. ప్రజాశ్రేషస్సు దృష్ట్యా ప్రభుత్వాలు పునరాలోచించి, రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనిత, శివకుమార్‌నాయక్, భగవాన్ స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇళ్లు మాకొద్దు!

- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్‌లు
- నగరం చుట్టూ కేటాయిస్తున్న అధికారులు
- వసతులు లేని ఇళ్లలో ఉండలేమంటున్న బాధితులు
- తీసుకునేందుకు నిరాకరిస్తున్న వైనం



అసంపూర్తిగా బండరావిరాలలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూసీ నిర్వాసితులకు 'డబుల్' టెన్షన్ పట్టుకుంది. అధికారులు ఇప్పటికే సర్వే పేరుతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుండటం.. నదీ గర్భం సహా బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటికి రెడ్ మార్క్ వేస్తూ ఇళ్లను ఉన్నఫళంగా ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తుండటం.. బాధితులకు అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను కేటాయిస్తుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్‌లను పొందిన నిరుపేద లబ్ధిదారులు మౌలిక సదుపాయాల లేమితో అక్కడ ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఒక్కో బ్లాకులో పది పదిహేను మందికి మించి ఉండటం లేదు. తట్టి అన్నారం, వనస్థలిపురం, కుర్మల్‌గూడలో ఇదే పరిస్థితి. తాజాగా మూసీ నిర్వాసితులకు ఈ ఇళ్లను కేటాయిస్తుండటంతో తీసుకునేందుకు వారు నిరాకరిస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేని చోట, ఊరికి దూరంగా ఎలా ఉండగలమని ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు.

నిరాకరిస్తున్న నిర్వాసితులు

నగరంలో 55 కిలోమీటర్ల పొడవున విస్తరించిన మూసీ పరీవాహక ప్రాంతంలో 12 వేలకుపైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో నదీగర్భంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1,595, రంగారెడ్డిలో 332, మేడ్చల్ పరిధిలో 239 నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కూడిన బృందాలు రెండు రోజులుగా మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి, ఆయా నిర్మాణాలకు రెడ్‌మార్క్ వేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ నివాసం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని పేర్కొంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. నిర్వాసితులకు ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా ఉన్న 15 వేలకుపైగా డ బుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించి కొన్నిచోట్ల పూర్తి చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొల్లూరులో ఉన్న పలు ఇళ్లను పేదలకు పంపిణీ చేసింది. మెజార్టీ బ్లాకులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. స్టీలు, సిమెంట్, కూలీ ధరలు పెరగడంతో టెండర్ దక్కించుకున్న నిర్మాణ సంస్థలు చేతులెత్తేశాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

అసంపూర్తిగా భవనాలు

బండరావిరాలలో పది బ్లాకులు నిర్మించారు. స్లాబు, బ్రిక్ వర్క్ మాత్రమే పూర్తయింది. గదులకు డోర్లు బిగించ లేదు. తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు నుంచి నీరు లీకవుతోంది. నిర్మాణాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ, కరెంట్, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఇక బాచారంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. రంగులు కూడా వేశారు. డోర్లు, కిటికీలు బిగించారు. విద్యుత్ లైటింగ్, ప్లంబింగ్ వర్క్స్ పూర్తి చేయాల్సి ఉంది. వనస్థలిపురం, తట్టి అన్నారంలో నిర్మించిన ఇళ్లలో ఇప్పటికే సగానికిపైగా పంపిణీ చేసినప్పటికీ మౌలిక సదుపాయాలు లేక మెజార్టీ లబ్ధిదారులు ఖాళీ చేసివెళ్లారు. లిఫ్టులు లేకపోవడంతో పై అంతస్తుల్లోకి చేరుకునేందుకు వృద్ధులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇక బాటసింగారంలో స్లాబ్ వర్క్ మాత్రమే పూర్తి చేశారు. గోడలు, ప్లాస్టింగ్ వర్క్ పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు నుంచి నీరు లీకవుతోంది. నిర్మాణాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ, కరెంట్, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. వీటిని మూసీ నిర్వాసితులకు కేటాయించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కనీస వసతులు కూడా లేని వీటిని తీసుకునేందుకు నిర్వాసితులు వెనుకాడుతున్నారు. నందనవనంలో నిర్మించిన ఇళ్లలో ఆక్రమణదారులు తిష్టవేశారు. వీరిని ఖాళీ చేయించి, అర్హులకు కేటాయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. మూసీ నిర్వాసితులకు ఇక్కడ ఇళ్లు కేటాయిస్తే.. ఆక్రమణదారుల నుంచి చుక్కెదురు కానుంది.

భూములు తిరిగివ్వండి

అనంతగిరి: జైదుపల్లిలో ఫారెస్టు అధికారులు తీసుకున్న భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని, అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, అనసూయ, సత్తయ్య, నర్సింహులు, భిక్షపతి, శ్రీనివాస్, బుచ్చన్న, యాదమ్మ, సాయన్న, వెంకటయ్య రాందాసు తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో డిజిటల్ బోధన

- ఆన్‌లైన్ తరగతులపై విద్యార్థుల ఆసక్తి
- పెరుగుతున్న విషయ పరిజ్ఞానం
- అర్థంకాని అంశాలపై చర్చ
- హర్షం వ్యక్తం చేస్తున్న బాలికలు



చెట్టుపల్లితండా కస్తూర్బా విద్యాలయం



డిజిటల్ పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

దుద్యాల్: సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తెలంగాణలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాఠాలు చెప్పేందుకు భారీ స్క్రీన్ లాంటి టీవీలను సమకూర్చింది. మండల పరిధి చెట్టుపల్లితండాలోని కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధనను ఉపాధ్యాయులు అందుబాటులోకి తెచ్చారు. పాఠాలు చెప్పేందుకు అనువుగా డిజిటల్ బోర్డుకు లోపలి భాగంలో పెద్ద టెలివిజన్‌ను అమర్చారు. దానిపై పాఠాలు చెబుతూనే.. ఏదైనా రాయడానికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థినులకు డిజిటల్ బోధన చేస్తున్నారు.

చిత్ర పటాలను చూపిస్తూ..

జీవ శాస్త్రానికి సంబంధించిన పాఠాలు చెప్పే క్రమంలో కొన్ని రకాల చిత్ర పటాలను చూపిస్తూ బోధిస్తున్నారు. మానవ జీర్ణక్రియ, గణితానికి సంబంధించి త్రికోణమితి సూత్రాలు, భౌతిక, రసాయన శాస్త్రాల ఫార్ములాలు, సాంఘిక శాస్త్రం దేశ, ప్రపంచ పటాలను తెరపై చూపిస్తూ బోధిస్తుండటంతో విద్యార్థినులు సంతోసం వ్యక్తంచేస్తున్నారు. పూర్తి స్థాయిలో సులభంగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారు.

సులువుగా అర్థం అవుతోంది



డిజిటల్ తెరపై చెప్పిన పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. లేని పక్షంలో ఉపాధ్యాయుల సహాయంతో మరలా వీక్షిస్తున్నాం. వింటున్నాం. అప్పుడే పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతోంది. ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉంది. జీవ, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన పటాలను క్షణంగా చూస్తున్నాం.

– తనూజ, 10వ తరగతి, కేజీబీవీ, చెట్టుపల్లితండా

తెరపై చదువుకు బాలికల ఆసక్తి



డిజిటల్ బోధనకు విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా తరగతులు పూర్తయిన తరువాత సాయంత్రం స్టడీ అవర్ లేదా నైట్ స్టడీ అవర్‌లో టెలివిజన్ ద్వారా అర్థం కాని అంశాలను మరోసారి వినిపించి, పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గణితంలో త్రికోణమితి, జాతీయ పటాలు, జీవ శాస్త్రంలో జీర్ణ వ్యవస్థ, గుండె, మూత్ర పిండాలు వంటి తదితర పటాలను టెలివిజన్ ద్వారా చూపించి, వినిపించడంతో పూర్తిగా తెలుసుకుంటున్నారు.

– రాధిక, ప్రిన్సిపాల్, కేజీబీవీ, చెట్టుపల్లి తండా

క్లుప్తంగా

నాటక సమాజ సమాఖ్యల కమిటీ ఎన్నిక


నాగేశ్వర్


జగన్

పరిగి: తెలంగాణ నాటక సమాజ సమాఖ్యల జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జగన్‌లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జగన్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, జగదీశ్వర్, లాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నారాయణ, శ్రీశైలం, నర్సింహులు పలువురిని కమిటీ సభ్యులుగా నియమించారు. అనంతరం రాష్ట్ర కమిటీ కార్యదర్శి దుర్వాసరాజు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా సుచరితరెడ్డి



అనంతగిరి: బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా వికారాబాద్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ సుచరితరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి, అందుకు సహకరించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటి కోసం తిప్పలు


సీతా ఫలాలు విక్రయిస్తున్న మహిళలు

దుద్యాల్: ఎండనకా.. వాననకా.. రోడ్లపై సీతా ఫలాలు అమ్ముకునే వారి జీవన పోరాటం కోట్ల రూపాయలు గడించడానికి కాదు. పొట్ట కూటి కోసమే అని ఈ చిత్రాలను చూస్తే అర్థం అవుతోంది. ఏడాదికి ఒక సారి కాసే ఈ ఫలాలను రోడ్లపై విక్రయిస్తుండగా.. ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. అడవిలోకి వెళ్లి చెట్టనకా.. పుట్టనకా.. తిరిగి కోసుకొచ్చిన ఫలాలను.. అందరికీ అందుబాటులో ఉండే ధరలకు అమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తుంటారు. అలాంటి వారి వద్ద బేర సారాలు ఆడటం మంచిది కాదని, సూపర్ మార్కెట్లో అమ్మే ధరల కన్నా తక్కువ ధరలకే అమ్ముతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలని సూచిస్తున్నారు.

మహిళ బలవన్మరణం

పెద్దేముల్: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధి కందనెల్లితండాకు చెందిన రామిబాయి(49) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె దూలానికి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన ఇరుగుపొరుగు, కుటుంబ సభ్యులు వెంటనే ఉరి తాడును తొలగించి తాండూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలు కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆస్పత్రిలో మృతురాలు బంధువులు, వైద్యుల మధ్య గొడవ జరగగా.. పోస్టుమార్టం చేయమని డాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో బాధిత వ్యక్తులు డాక్టర్లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చొరవతో మూడు గంటల అనంతరం పోస్టుమార్టం అయింది.

అధిక పిలకలతో నష్టం


అధిక పిలకలను చూపుతున్న రైతు నర్సింలు


విత్తనాల కొనుగోలు రసీదు

దిగుబడులపై తీవ్ర ప్రభావం
- హైబ్రిడ్ వంగడాలతో నష్టపోయా
- మొక్కజొన్న రైతు ఆందోళన

మోమిన్‌పేట: అధిక దిగుబడులతో లాభాలు పొందాలని భావించిన రైతులు.. బ్రాండ్ కంపెనీలకు చెందిన హైబ్రిడ్ వంగడాలను అధిక ధరలకు కొనుగోలు చేసి విత్తుకుంటున్నారు. కానీ అవే ఒక్కోసారి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మొక్కజొన్న మొక్కకు ఒకటి లేదా రెండు పిలకలు వస్తే.. పొత్తుకు గింజలు నిండుగా పట్టి దిగుబడులు వస్తాయి. కాని ఆదే చెట్టుకు నాలుగైదు పిలకలు వస్తే గింజలు నిండుగా పట్టక, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి, అన్నదాతలను నష్టాల పాలు చేస్తున్నాయి. మండల పరిధి ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతు నర్సింహులు.. ప్రముఖ కంపెనీకి చెందిన ఎక్కా 2288 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి విత్తుకున్నాడు. ఒక్కో మొక్కకు నాలుగైదు పిలకలు వచ్చాయి. అలా వచ్చిన పిలకలకు నిండుగా గింజలు పట్టవని ఒకటి, లేదా రెండు వస్తేనే అధిక గింజలతో దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. ఇలా నాలుగైదు రావడం వలన దిగుబడి రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంటికి రెప్పలా కాపాడుకున్నా..

సదాశివపేటలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో మూడు బస్తాలను ఒక్కో బస్తాకు రూ.1050 చొప్పున చెల్లించి కొనుగోలు చేశానని, విత్తింది మొదలు.. పంట ఏపుగా పెరిగే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటే.. అధిక పిలకలతో నష్టం తప్పదని బాధిత రైతు వాపోతున్నాడు. అడవి పందుల బెడదకు.. పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నా లాభం లేదని ఆవేదన చెందుతున్నారు. మార్కెట్లో మొక్కజొన్నకు మంచి ధర ఉందని, పెట్టుబడులు పోనూ.. లాభాలు వస్తాయనుకుంటే.. అధిక పిలకల వలన దిగుబడి తగ్గుతోందని పేర్కొన్నాడు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని రైతు నర్సింహులు వెల్లడించారు.


అలుగు కింద కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కోట్‌పల్లిలో పర్యాటకుల సందడి

ధారూరు: కోట్‌పల్లి జలాశయానికి పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో ప్రాజెక్టు పరిసరాలు సందర్శకులతో సందడిగా మారాయి. పచ్చని చెట్లు.. జలపాతం సవ్వడులతో మరపురాని అనుభూతిని పొందారు. ప్రాజెక్టు అలుగు పైనుంచి జాలువారుతున్న నీటిలో సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొట్టారు. యువత ఎక్కువగా బోటింగ్‌పై మక్కువ చూపారు. సకుటుంబ సమేతంగా పలువురు పచ్చదనం కింద వనభోజనం చేశారు.


ఫొటోకు పోజు ఇస్తున్న యువతి

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కొడంగల్ రూరల్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలల ఉషప్ప(48) శనివారం రాత్రి, గ్రామానికి సమీపంలో ఉన్న హస్నాబాద్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చెరువు లోతులోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఉషప్ప మృతదేహం

నిద్రలోనే అనంత లోకాలకు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: కుటుంబ సభ్యులతో అప్పటివరకు సంతోషంగా గడిపాడు. దావత్ ముగించుకొని నగరానికి పయనమయ్యాడు. అర్ధరాత్రి కావడంతో టోల్‌గేట్ వద్ద నిద్రకు ఉపక్రమించాడు. అదే అతడి పాలిట యమపాశమైంది. నిద్రిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌గేట్ వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన గోపాసు శ్రీను(36) హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సెంట్రింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు రవికి కుమారుడు పుట్టగా చూసేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్లాడు. శనివారం నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. చీకటి కావడంతో కొద్దిసేపు పడుకొని వెళ్దామని శ్రీను తన బైక్‌ను రాయికల్ సమీపంలోని టోల్‌గేట్ వద్ద పార్కుచేసి అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం గమనించిన టోల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


శ్రీను మృతదేహం

పోలీసుల అదుపులో విగ్రహాల చోరీ నిందితుడు

ఇబ్రహీంపట్నం: పంచలోహ విగ్రహాల చోరీకి పాల్పడిన నిందితుడిని ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిమినేడు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలోని శ్రీసీతారామ ఆంజనేయ పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. సీసీ ఫుటేజీల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా మతిస్థిమితంలేని వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది. విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ఉత్తమ్ ఇంటికి చేరుకొని, పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి ఉత్తమ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు.

వైద్యానికి తీసుకెళ్తుండగా..

బైక్ ఢీకొని పసికందు మృతి

కేశంపేట: కన్నవారి ప్రేమను ఆస్వాదిస్తూ రెండు నెలలు పూర్తవ్వక ముందే విధి ఆ పసికందుపై కన్నెర్రజేసింది. అనారోగ్యానికి గురైన తమ కుమారుడిని వైద్యానికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలుడు మృతి చెంది తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిలించాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన రమేశ్ తన భార్య పద్మతో కలిసి 45 రోజులు కుమారుడైన మహేందర్‌ని డాక్టర్‌ను సంప్రదించేందుకు నిర్ధవెళ్లి గ్రామానికి బైక్‌పై శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో బోధునంపల్లి గ్రామ గేట్ సమీపంలో కేశంపేట గ్రామానికి చెందిన యాదయ్య తన బైక్ పైన గ్రామానికి వస్తుండగా ఇరు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పసికందుతో సహా మొత్తం నలుగురికి గాయలయ్యాయి. వీరిలో యాదయ్యను షాద్‌నగర్‌కు, పద్మ, రమేశ్‌తో పాటు బాలుడిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మహేందర్‌ను మెరుగైన చికిత్స కోసం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. యాదయ్య బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని మృతుడి తాత నరసింహ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.


మహేందర్ (ఫైల్)

దివ్యాంగులపై దాడులు అనాగరికం

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

కందుకూరు: దివ్యాంగులపై దాడులు చేస్తే సహించేదిలేదని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. దివ్యాంగుడిపై దాడి ఘటనలో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం కందుకూరు పీఎస్‌లో బేగంపేటకు చెందిన ఆర్టీసీ కండక్టర్‌పై వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులతో కలిసి మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నల్గొండ జిల్లా మర్రిగూడ ఐకేపీ నర్సింహపై కండక్టర్ దాడి చేశాడని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి యాచారం జంగయ్య, జిల్లా నాయకులు మద్దెల బాల్‌రాజ్, గువ్వల యాదయ్య, పగడాల రాజు, నర్సింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు

నకిలీ పత్రాలతో రూ.కోట్ల భూమికి ఎసరు

- కోర్టు, అధికారుల దర్యాప్తులో ముఠా గుట్టురట్టు
- ఇద్దరి అరెస్టు, పరారీలో ముగ్గురు

మహేశ్వరం: రూ.కోట్లు విలువ చేసే పట్టా భూమికి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి కోర్టు, రెవెన్యూ అధికారులను తప్పదోవ పట్టించిన ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండల పరిధిలోని నాగారం గ్రామంలో 181, 182 సర్వే నంబర్లలో మహ్మద్ అజీఖాన్, ఉన్నీసాబేగం, మున్వర్‌ఖాన్‌లకు 51.22 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇటీవల ఆ భూమిని మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన మాసారం చంద్రయ్యగౌడ్, వారి భాగస్వాములు కలిసి కొనుగోలు చేశారు. ఈ విలువైన భూమిపై చంద్రాయన్‌గుట్టకు చెందిన సాహెబ్‌జాద ఖుర్షీద్ అలీఖాన్, కందుకూరు మండలం మహ్మద్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ జానీ, చార్మినార్‌కు చెందిన మహ్మద్ హసన్, పాతబస్తీకి చెందిన అబ్బాస్, అలీమ్‌లు కన్నేశారు. ఈ భూమికి సంబంధించిన ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించారు. హైదరాబాద్‌లోని శాస్త్రీపురంలో 1976లో 63 గజాల ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్‌పైన నాగారంలో ఉన్న 51.22 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. సంబంధిత పత్రాలతో కోర్టులో పిటిషన్ వేశారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలను నిర్ధారించాల్సిందిగా కోర్టు జిల్లా కలెక్టర్‌ను కోరింది. మహేశ్వరం తహసీల్దార్‌ను విచారణ చేపట్టి అసలు పట్టాదారు చంద్రయ్యగౌడ్ అని తేల్చారు. ఈ వ్యవహారంపై భూయజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహ్మద్ ఆసిఫ్ జాని, మహ్మద్ హసన్‌లను అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే నిర్మాణాల కూల్చివేత


కాలనీ లేఔట్‌ను చూపిస్తున్న బాధితులు

పంజగుట్ట: కొందరు రెవెన్యూ అధికారులు తమపై కక్షకట్టి హైడ్రా పరిధిలో లేకున్నా అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేటలో తమ మూడు భవంతులను కూల్చివేసి తమను రోడ్డుపాలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం కూల్చివేతలు చేపట్టరాదని ఆదేశించినా వాటిని పట్టించుకోకుండా తమ భవనాలను కూల్చివేశారని ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు డాక్టర్ మహ్మద్ రఫీ, పొదలకూరి కల్యాణ్, మధుసూదన్ మాట్లాడుతూ .. అమీన్‌పూర్ మండలం, కృష్ణారెడ్డిపేటలో సర్వేనెంబర్ 165, 166లో తాము ఫ్లాట్‌లు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు సమయంలో 1986 నుంచి లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ఎల్ఆర్ఎస్ కూడా ఉందని, అన్ని అనుమతులతో ప్రభుత్వానికి చలాన్లు కట్టి మరీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. కాగా ఫ్లాట్ నెంబర్ 92లో 270 గజాల స్థలంలో నాలుగు అంతస్తుల్లో కిడ్స్ కేర్ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించినట్లు మహ్మద్ రఫీ తెలిపాడు. ఫ్లాట్ నెంబర్ 90లో కల్యాణ్ 300 గజాల స్థలంలో అన్ని అనుమతులతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టానన్నారు. ఫ్లాట్ నెంబర్ 74లో మధుసూదన్ 284 గజాల స్థలంలో ఐదు అంతస్తుల నిర్మించాడన్నారు. కాగా తమ స్థలాలు సర్వేనెంబర్ 165, 166లో ఉన్నప్పటికీ ఇది సర్వే నెబర్ 164గా పేర్కొంటూ అందులో ప్రభుత్వానికి చెందిన 44 ఎకరాల స్థలం ఉండాలని చెబుతూ శనివారం సాయంత్రం నోటీసులు ఇచ్చి ఆదివారం ఉదయం కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఉన్నతాధికారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సదరు కట్టడాలు అక్రమమని, వాటికి పర్మిషన్ లేదని, అక్కడ అసుపత్రి లేదని, ఇంకా భవనం నిర్మాణ దశలోనే ఉందని వక్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సర్వే చేపట్టకుండానే తమ స్థలం 164 సర్వే నెంబర్‌లో ఉందని ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. తమకు రిజిస్ట్రేషన్ చేసింది ప్రభుత్వమే, అన్ని రకాల అనుమతులు ఇచ్చింది ప్రభుత్వమేని ఇప్పుడు ప్రభుత్వమే తమ నిర్మాణాలు కూల్చివేసి రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిర్మాణాలు చేస్తున్నప్పుడు కూడా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ నోటీసులు ఇచ్చారని తాము హైకోర్టుకు అన్ని ఆధారాలతో సంప్రదించగా కోర్టు రెవెన్యూ అధికారులకు సదరు స్థలాల జోలికి వెళ్లరాదని ఉత్తర్వులు ఇచ్చిందని అయినా తమ నిర్మాణాలు కూల్చివేస్తే కోర్టు ధిక్కరణ కేసు వేసినట్లు తెలిపారు. దీంతో తమపై కక్ష పెంచుకున్న రెవెన్యూ అధికారులు హైడ్రాను సంప్రదించి వారి సాయంతో నిర్మాణాలు కూల్చివేశారని తెలిపారు. తాము తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించామని బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తిరిగి సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.


మైసిగండి శివ రామాలయాలు


జలకళతో కోనేరు

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మైసిగండిలో వచ్చే నెల 3 నుంచి మహోత్సవాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు

కడ్తాల్: ప్రకృతి రమణీయ క్షేత్రం, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న దక్షిణ తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. స్థానికంగా శివాలయ, రామాలయ దేవస్థానంలో కొలువైయున్న శ్రీ అన్నపూర్ణేశ్వరి, మహాలక్ష్మి జ్ఞాన సరస్వతిదేవీల శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 3న ప్రారంభమై 12వ తేదీ విజయదశమి వరకు వైభవంగా జరగనున్నాయి. వాటికి సంబంధించి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు ఏటా జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, నల్గొండ, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, మేడ్చల్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మైసిగండి మైసమ్మ దేవతను దర్శించుకుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతునాయక్ తెలిపారు. ఆలయాలను రంగులు, విద్యుద్దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయామానంగా తీర్చిదిద్దుతున్నారు. సర్వాంగ సుందరంగా చేసిన అలంకరణ ఆకట్టుకుంటుంది.


అన్నపూర్ణేశ్వరిదేవి

అమ్మవారి అలంకరణలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నపూర్ణేశ్వరి దేవి వివిధ రూపాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 3న గురువారం అన్నపూర్ణదేవి అలంకారం, 4న బాలా త్రిపుర సుందరిదేవి, 5న గాయత్రీ దేవి, 6న భవానీదేవి, 7న లలితా త్రిపుర సుందరిదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని, ఈ సందర్భంగా ప్రతి రోజు ఆలయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.


మైసిగండి మైసమ్మ దేవత

రవాణా సదుపాయం

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. ఇది నగరం నుంచి 48 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి ప్లాట్ ఫాం 29, 30, 31 నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్గొండ ఎక్స్ రోడ్, ఐ.ఎస్.సదన్, సంతోష్‌నగర్, చంద్రాయన్‌గుట్ట నుంచి బస్సులున్నాయి. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట్ నుంచి బస్సు సౌకర్యం కలదు.